సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం | 16 | మార్చి | 2024



ప్రత్యేక నిఘా

అక్రమ మద్యం, నాటు సారా విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా ఎస్ఈబీ సూపరింటెండెంట్ రామకృష్ణ హెచ్చరించారు. 8లో ▸



ఎన్నికలకు పటిష్ట చర్యలు

ఏలూరులో రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట చర్యలు చేపట్టినట్టు చెప్పారు. 8లో ▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం (సాయంత్రం)	సహరి ఆదివారం (ఉదయం)
భీమవరం	6.20	4.52
ఏలూరు	6.21	4.48

న్యూస్‌రీల్

గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

తణుకు టౌన్: ఎమ్మెల్సీ, ఆంధ్రప్రదేశ్ లయన్స్ సేవా సంస్థల చైర్మన్ వంక రవీంద్రనాథ్ శుక్రవారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి త్వరలో విజయవాడలో జరిగే రాష్ట్ర లయన్స్ క్లబ్ కన్వెన్షన్‌కు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ మేరకు విజయవాడలోని గవర్నర్ అధికార కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేసినట్టు ఆయన చెప్పారు. లయన్స్ సేవా సంస్థల కార్యక్రమాలను గవర్నర్‌కు వివరించామన్నారు. లయన్స్ పూర్వ జిల్లా గవర్నర్‌లు కేవీ రమణారావు, మేకా శ్రీరామ్ సురేష్, దామెర్ల శ్రీ శాంతి ఉన్నారు.

గ్రూప్–1 పరీక్షలకు 7 కేంద్రాలు



మాట్లాడుతున్న ఏపీపీఎస్సీ అధికారులు

భీమవరం: రాష్ట్రంలో ఈనెల 17న జరిగే గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లాలో 7 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారులు పి.నవజ్యోతి, బి.విజయనిర్మల తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కేంద్రాల లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో సమీక్షించారు. పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లాలోని 7 కేంద్రాల్లో 4,209 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి జి.గణపతి రావు, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కె.గంగాధరరావు, హౌసింగ్ ఈఈ బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా రాజ్యలక్ష్మి



అత్తిలి: రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అత్తిలికి చెందిన కంకటాల సత్య నాగ వెంకట రాజ్యలక్ష్మి నియమితులయ్యారు. అత్తిలి మండల వైఎస్సార్‌సీపీ సేవాదళ్ అధ్యక్షుడు కంకటాల సతీష్ సతీమణి రాజ్యలక్ష్మి. తనకు పదవి రావడానికి సహకరించిన మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగుల గ్రీవెన్స్

భీమవరం (ప్రకాశంచౌక్): ఉద్యోగులు తమ సమస్యలను ఎంప్లాయీస్ గ్రీవెన్స్ ద్వారా పరిష్కరించుకోవచ్చని కలెక్టరేట్ పరిపాలన అధికారి పి.పాపారావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌లో భాగంగా ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతినెలా మూడో శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. డీఎంహెచ్ఓ డి.మహేశ్వరరావు, సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



కేంద్రాల్లో నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

భీమవరం: జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియెట్ జనరల్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలోని 50 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా ఎక్కడా మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు కాకపోవడం విశేషం. శుక్రవారం జరిగిన పరీక్షలకు 14,418 మంది జనరల్ విద్యార్థులకు 418 మంది, 756 మంది ఒకేషనల్ విద్యార్థులకు 149 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 96 శాతం హాజరు నమోదయ్యింది. మరో నాలుగు రోజులపాటు ఒకేషనల్ పరీక్షలు జరుగుతాయని ఆర్ఐఓ కె.చంద్రశేఖర్ బాబు తెలిపారు. ఈనెల 1న ప్రారంభమైన ప్రధాన పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందంతో ఇంటిముఖం పట్టారు.

గోసంరక్షణ శాలకు టర్కీ కోళ్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి గోసంరక్షణ శాలకు తణుకుకు చెందిన కుడిపూడి శ్యామ్ అనే భక్తుడు శుక్రవారం నాలుగు టర్కీ కోళ్లను బహుమతిగా అందించారు. ప్రస్తుతం గోసంరక్షణ శాల వద్ద ఏనుగు, అశ్వాలు, కజానా బాతులు, కుందేళ్లు ఆకర్షిస్తున్నాయి. ఇప్పుడు ఈ టర్కీ కోళ్లు వాటి జతకు చేరాయి.

టీడీపీలో సీనియర్లకు మొండిచేయి

- దళిత మాజీ మంత్రులకు నో టికెట్
- ఏలూరు జిల్లా అధ్యక్షుడి సీటు గల్లంతు
- పొత్తుల పేరుతో సీనియర్లకు ఎసరు
- అసమ్మతితో రగులుతున్న నేతలు
- ఉమ్మడి పశ్చిమలో 'దేశం'లో నిస్తేజం
- రాజీనామాలకు నాయకుల సన్నద్ధం







వేటుకూరి శివరామరాజు, ఉండి మాజీ ఎమ్మెల్యే

గన్ని వీరాంజనేయులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు







బి.మాధవనాయుడు, మాజీ ఎమ్మెల్యే

కేఎస్ జవహర్, మాజీ మంత్రి

పీతల సుజాత, మాజీ మంత్రి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరిలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలకు సీన్ కట్ అయ్యింది. దశాబ్దాలుగా పార్టీని అంటిపెట్టుకున్న సీనియర్ నాయకులను పొత్తుల పేరుతో, సర్వేల పేరుతో వారి టికెట్లు గల్లంతు చేసి టీడీపీ వదిలించుకుంది. జిల్లాలో ఏకంగా ఐదుగురు సీనియర్లకు మొండిచేయి చూపి డబ్బు సంచులకే ప్రాధాన్యం ఇస్తూ 'క్యాష్ అండ్ క్యారీ' పద్ధతిలో టికెట్లు ఇవ్వడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. దళిత మాజీ మంత్రులు కేఎస్ జవహర్, పీతల సుజాత, టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్యేలు వేటుకూరి శివరామరాజు, బండారు మాధవనాయుడుకు టీడీపీ జాబితాలో సీటు గల్లంతు కాగా పార్టీ పెద్దలు నామ మాత్రంగా అయినా పట్టించుకోని దుస్థితి.

పక్కన పెట్టేశారు

జిల్లా తెలుగుదేశం పార్టీలో సీనియర్లను పూర్తిగా పక్కన పెట్టారు. సామాజిక, ఆర్థిక ప్రాబల్యం ఉండి నియోజకవర్గంలో పనిచేస్తున్నా లోకేష్‌తో సత్సంబంధాలు గొప్పగా లేవని, సంతృప్తిస్థాయి లేదనే కారణాలతో టికెట్లు గల్లంతు చేశారు. అది కూడా సామాజిక సమీకరణాలు పట్టించుకోకుండా ఎస్సీల్లో ఒకే సామాజిక వర్గానికి అన్ని సీట్లు ఇవ్వటం, పొత్తుల పేరుతో టీడీపీ కాపు సీట్లన్నీ పూర్తిగా వదిలించుకోవడం, బీసీలకు ఒక్క సీటు మాత్రమే కేటాయించడంపై జిల్లా తెలుగుదేశం పార్టీలో రాజకీయం రగులుతుంది. డబ్బే ప్రామాణికం అంటూ అడ్డగోలుగా టికెట్లు కేటాయించడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

తీవ్ర అసంతృప్తితో..

ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, ఉండి మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినా పార్టీ కనీసం స్పందించలేదు. శివరామరాజు అనుచరులతో సమావేశాలు నిర్వహించి టీడీపీకి గుడ్‌బై చెబుతానని తన నిర్ణయాన్ని ప్రకటించారు. ఇక నరసాపురం నుంచి 2014 ఎమ్మెల్యేగా గెలుపొందిన బండారు మాధవనాయుడు అక్కడ క్రియాశీలకంగా పనిచేసి టికెట్ ఆశించి పొత్తుల పేరుతో భంగపడ్డారు. కనీసం పార్టీ నుంచి పిలుపు లేకపోగా అధినేత అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించి భంగపడటంతో రాజీనామా దిశగా యోచన చేస్తున్నారు. అలాగే టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు పొత్తులతో టికెట్ పోగొట్టుకున్నారు. జిల్లా అధ్యక్షుడు కావడంతో పార్టీ పెద్దలు ఒకటికి రెండు సార్లు బుజ్జగించటంతో మౌనంగా ఉన్నారు.

పెత్తందారులదే టీడీపీలో పెత్తనం అంటూ..

రెండు దశాబ్దాల నుంచి తెలుగుదేశం పార్టీలోనే ఉంటూ పార్టీ సొంత సామాజిక వర్గం నేతల చేతిలో అణచివేత, వేధింపులకు గురైనా.. పార్టీ వీడకుండా ఉన్న మాజీ మంత్రులు పీతల సుజాత, కేఎస్ జవహర్‌కు చంద్రబాబు మొండిచేయి చూపారు. 2014లో జవహర్ కొవ్వూరు నుంచి, పీతల సుజాత చింతలపూడి నుంచి గెలుపొంది మంత్రులుగా పనిచేశారు. అయినా ఆయా నియోజకవర్గాల్లో బాబు సొంత సామాజికవర్గ నేతల చేతిలో రాజకీయంగా బలికావడంతోపాటు 2019 నుంచి 2024 వరకు ఐదేళ్లలో కనీసం ఆయా నియోజకవర్గాలకు ఇన్‌చార్జులుగా కూడా వేయించుకోలేని దుస్థితి వారిద్దరిదీ. సామాజిక కోణంలో అయినా కచ్చితంగా అవకాశం వస్తుందని రెండు జాబితాల వచ్చే వరకు వేచి చూసి భంగపడిన వారు తీవ్ర అసంతృప్తితో మాట్లాడారు. పెత్తందారులదే టీడీపీలో పెత్తనమని, దళితులను పట్టించుకోవడం లేదంటూ ఘాటుగా మాట్లాడటంతో జిల్లాలో చర్చగా మారింది.

ఈవీఎంలపై అవగాహన తప్పనిసరి

కలెక్టర్ సుమిత్‌కుమార్



తణుకులో ఈవీఎంలపై పోలింగ్ అధికారులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

తణుకు టౌన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగంపై సెక్టార్ అధికారులు, పీఓలు, ఏపీఓలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఈవీఎంలపై ఎన్నికల సిబ్బందికి నిర్వహించిన శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరగడానికి సెక్టార్ అధికారులు, పీఓలు, ఏపీఓల పాత్ర కీలకమన్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, హ్యాండ్ బుక్, పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను పోలింగ్ కేంద్రంలో అమర్చడం, మాక్ పోలింగ్ నిర్వహణ, హ్యాండ్ బుక్‌లోని అంశాలు తెలిసి ఉండాలన్నారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లలో సమస్యలు తలెత్తితే తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పోలింగ్ రోజున సంబంధిత అధికారులు స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎం, వీవీ ప్యాట్లను, కంట్రోల్ యూనిట్లను పోలింగ్ అధికారులకు అందజేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ, తహసిల్దార్ బీఎం ముక్తేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీలలిత పాల్గొన్నారు.

షెడ్యూల్ వెలువడిన వెంటనే..

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి అన్నిరకాల బృందాలు సిద్ధంగా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్, వీఎస్‌టీ, వీవీఎస్ ఖర్చులు, మెటీరియల్ మేనేజ్‌మెంట్, రెస్పాన్స్ మేనేజ్‌మెంట్, పలు రకాల బృందాలు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఏడు నియోజకవర్గాలకు పలు రకాల బృందాలను సిద్ధం చేశామని, ఈ మేరకు సిబ్బందికి ఉత్తర్వులు కూడా అందజేశామని తెలిపారు. జిల్లాకు వచ్చే ఎన్నికల పరిశీలకులు, బృందాలకు వాహనాలు సిద్ధంగా ఉంచాలని డీటీసీని ఆదేశించామని పేర్కొన్నారు. రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్స్ వద్ద బారికేడ్లు, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ అధికారిని ఆదేశించారు.

సమర్థవంతంగా పనిచేయాలి

భీమవరం: పీఓలు, ఏపీఓలు సమర్థవంతంగా పని చేసి ఎన్నికలను విజయవంతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, మాక్‌పోల్, ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, అధికారుల విధులు తదితర అంశాలపై ఆయన సూచనలిచ్చారు. పోలింగ్ సమయంలో ప్రభుత్వ అధికారులు ఇచ్చిన ఆహారం, మంచినీరు, అల్పాహారం మాత్రమే తీసుకోవాలని ఏ ఇతర రాజకీయ పార్టీల వ్యక్తులు ఇచ్చిన వస్తువులు, ఆహార పదార్థాలను తీసుకోకూడదని స్పష్టం చేశారు. సెక్టార్ అధికారులు, పీఓలు, ఏపీఓలు పాల్గొన్నారు.

వాసుబాబును అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాం



ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును మర్యాదపూర్వకంగా కలిసిన నౌడు వెంకటరమణ

గణపవరం: ఉంగుటూరు నియోజకవర్గంలో సీనియర్ నాయకుడు, బీసీ సంఘాల రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ జనసేన నాయకుడు నౌడు వెంకటరమణ వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గణపవరం మండలం బువ్వనపల్లిలోని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు క్యాంపు కార్యాలయంలో ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకటరమణకు ఎమ్మెల్యే వాసుబాబు పార్టీ కండువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నౌడు వెంకటరమణ మాట్లాడుతూ గత ఎన్నికల్లో వాసుబాబుకు దాదాపు 35 వేలకు పైగా మెజార్టీ వచ్చిందన్నారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, వాసుబాబు నిజాయితీతో వచ్చే ఎన్నికల్లో 60 వేల మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. బీసీలకు సీఎం జగన్ పాలనలోనే న్యాయం జరిగిందని, చంద్రబాబు బీసీలకు చేసిందేమీ లేదన్నారు. రాజకీయ పదవులతో పాటు పార్టీలో కూడా బీసీలకు 70 శాతం అవకాశాలు కల్పించిన ఘనత సీఎం జగన్‌కే ఉందని, బీసీలంతా వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటారన్నా రు. నియోజకవర్గంలో గ్రామగ్రామాన పర్యటించి బీసీలను సంఘటితం చేసి వాసుబాబు గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వెంకటరమణ అన్నారు. వెంకటరమణ నిడమర్రు మండలం పత్తేపురం గ్రామానికి చెందినవారు. వ్యాపార రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. గతంలో ఆయన గణపవరం జెడ్పీటీసీ సభ్యునిగా పనిచేశారు. 2019 ఎన్నికల్లో ఉంగుటూరు నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. కొంతకాలంగా బీసీ సంఘాల రాష్ట్ర కార్యదర్శిగా ఆయా వర్గాల ఐక్యతకు పాటుపడుతున్నారు.

పవన్ పిలుపుతో అసహనం

నిడమర్రు: పత్తేపురంలో నౌడు వెంకటరమణ విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబును సీఎం చేసేందుకు పల్లకీ మోద్దాం అనే పవన్‌కళ్యాణ్ నినాదం జనసేన శ్రేణుల్లో అసహనానికి గురిచేసిందని అన్నారు. 2019 ఎన్నికల్లో జనసేన ఘోర పరాజయం పాలైనా నియోజకవర్గాల్లో పార్టీని బతికించేందుకు ప్రయత్నించిన ప్రతి నాయకుడికీ ఈసారి ఎన్నికల్లో టికెట్ ఇవ్వకుండా పవన్‌కళ్యాణ్ అన్యాయం చేశారని మండిపడ్డారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

జగనన్న పాలనలో పేదలకు మేలు



స్థలం పత్రాలు అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ఏ ఒక్క నిరుపేద కన్నీరు పెట్టింది లేదని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. శుక్రవారం ఉండిలో సుమారు 800 మంది ఇళ్ల లబ్ధిదారులకు శాశ్వత ఇంటి పట్టా హక్కు పత్రాలను ఆయన అందజేశారు. అనంతరం సర్పంచ్ కమతం సౌజన్యబెనర్జీ, ఉప సర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పీవీఎల్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో పేదలకు మేలు చేసింది వైఎస్సార్, సీఎం జగన్ మాత్రమే అన్నారు. సంక్షేమ పథకాలను మహిళల పేరుతో అమలు చేస్తూ సమాజంలో వారి గౌరవం పెంచారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల మందికి పైగా ఇళ్ల పట్టాలు ఇచ్చారని, పేదల చదువులకు రూ.50 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ప్రజలకు మంచి చేసే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీమళ్లీ కావాలని, మోసగాళ్లను నమ్మితే నట్టేట ముంచేస్తారన్నారు. ప్రతిపక్షాల మాటలను నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జానపద కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థపై అసత్యాలు తగవు



ఏలూరు డీపీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

ఏలూరు రూరల్: దేశంలోనే ఖ్యాతిగాంచిన సచివాలయ వ్యవస్థ, గ్రేడ్–5 ఉద్యోగులపై అసత్యాల ప్రచురించడం అన్యాయమని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పచ్చ మీడియా పత్రికలో ప్రచురితమైన 'పైసలిస్తే పెత్తనం మీదే' అనే కథనాన్ని తీవ్రంగా ఖండించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు సాయంత్రం ఏలూరు జిల్లా డీపీఓ కార్యాలయం వద్దకు చేరుకుని ఈ కథనంపై నిరసన తెలిపారు. సచివాలయ ఉద్యోగి వెంకన్న మాట్లాడుతూ ఇటీవల సీఎం జగన్ గ్రేడ్–5 ఉద్యోగులకు డీడీఓ బాధ్యతల అప్పగిస్తూ జీఓ 11 ఉత్తర్వులు జారీ చేశారని గుర్తు చేశారు. వీటి ఆధారంగా జిల్లా పంచాయతీశాఖ కార్యాలయ అధికారులు బాధ్యతలు అప్పగించేందుకు గ్రేడ్–5 ఉద్యోగుల నుంచి పైసలు డిమాండ్ చేస్తున్నారంటూ ఈనాడు పత్రిక అసత్యాలు ప్రచురించడం సరికాదన్నారు. పత్రికలో కథనం తీవ్ర మనస్తాపానికి గురి చేసిందని మరో ఉద్యోగి తంబి అన్నారు. ఆధారం లేని కథనాలతో సచివాలయ వ్యవస్థ ప్రతిష్ట దిగజార్చవద్దని హేమంత్ కోరారు. స్వప్రయోజనాల కోసం తప్పుడు వార్తలు రాసి ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీయవద్దని చంద్రశేఖర్ అన్నారు.

భగ్గుమన్న ఉద్యోగ సంఘాలు

యలమంచిలి: సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులను కించపరుస్తూ ఎల్లోమీడియాలో వచ్చిన కథనంపై గ్రేడ్–5 కార్యదర్శుల సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ప్రకటన విడుదల చేశారు. జిల్లా పంచాయతీ అధికారులు, గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులు ఈ కథనాన్ని తీవ్రంగా ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు ఎవరికీ పైసలు ఇవ్వలేదని వివరణ ఇచ్చారు.

పార్టీలన్నీ ఒక వైపు.. సీఎం జగన్ ఒక్కరే ఒక వైపు..

- ఎన్నికల పోరులో తోడుగా నిలవాలి
- ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: దేశంలోని పార్టీలన్నీ ఒకవైపు నిలిస్తే... మరోవైపు ఒంటరిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచి ఎన్నికల సంగ్రామంలో పోరాటం చేస్తున్నారని.. మీరంతా ఆయనకు అండగా నిలవాలని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు గన్‌బజార్ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు, కార్పొరేటర్ పొలిమేర రామదాసు, కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఆత్మీయ సమావేశం శుక్రవారం రాత్రి నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు, యువత, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల నాని మాట్లాడుతూ చంద్రబాబును సీఎం చేయడానికి పుట్టిన పార్టీ జనసేన అంటూ విమర్శించారు. పవన్ కళ్యాణ్‌కు ప్రజా సమస్యలపై అవగాహన లేదని, ఒక విధానం లేకుండా చంద్రబాబు కోసమే పనిచేస్తున్నారని ఆరోపించారు. సీఎం జగన్ ప్రజలను నమ్ముకుని ఎన్నికలకు వెళ్తున్నారని చెప్పారు. గుంటనక్కలు, తోడేళ్లు మీ మధ్యకు రానున్నాయని, వారంతా మోసపూరిత హామీలు, వాగ్దానాలు చేస్తారని అటువంటి వారిని నమ్మవద్దని హితవు పలికారు. గత టీడీపీ హయాంలో చంద్రబాబు ఎవరికైనా ఒక్క సెంటు భూమినైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. సీఎం జగన్ రాష్ట్రంలో ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో 3.30 లక్షల మందికి ఇళ్ల పట్టాలు అందించారని, ఏలూరు నియోజకవర్గంలో 33 వేల మంది ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని చెప్పారు.

ప్రజలకు పాలన చేరువ

ఏలూరు కో–ఆప్షన్ సభ్యుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ ఏలూరులో ప్రజలకు ప్రభుత్వ పాలనను చేరువ చేశామని, పారదర్శకంగా సేవలందించామని చెప్పారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆధ్వర్యంలో నగర అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఇడా చైర్మన్, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్ కో–ఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్‌గురునాథ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్ మాట్లాడారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న జేసీ లావణ్యవేణి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వినియోగదారుల హక్కులను రక్షించేందుకు నిర్దేశించిన బలమైన, స్పష్టమైన చట్టాలపై ప్రజలకు అవగాహన కలిపించే బాధ్యత యువతరంపై ఉందని జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఆర్ఎస్ఎస్ రాజు నేతృత్వంలో శుక్రవారం స్థానిక సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ సమాజంలో ప్రతి వినియోగదారుడు తమ హక్కులతోపాటు బాధ్యతలు తెలుసుకోవాలన్నారు. వినియోగదారుల రక్షణ చట్టం పటిష్టంగా అమలు కావడంపై అవగాహన కల్పిస్తామన్నారు. వినియోగదారుల చట్టంతో ఈ–కామర్స్, ఆన్‌లైన్ అమ్మకాలు, కొనుగోళ్లలో మోసాలు అరికడతారన్నారు. విద్యాసంస్థల్లో కన్స్యూమర్ క్లబ్‌లను ఏర్పాటు చేసి వాటి ద్వారా ఈ చట్టం పనితీరు, చట్టంలోని అంశాలపై అవగాహన కలిగించేందుకు కృషిచేస్తున్నామన్నారు. విద్యతోపాటు విద్యార్థులు వివిధ అంశాల్లో నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సీఏపీ శ్రీనివాస రామానుజాచార్యులు, జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యురాలు తదితరులు మాట్లాడుతూ వినియోగదారుల హక్కులకు సంబంధించిన పలు కీలక అంశాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం జేసీ లావణ్యవేణిని వినియోగదారుల ఫోరం సభ్యులు సన్మానించారు. అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల హర్షం

ఏలూరు (టూటౌన్): అంగన్‌వాడీల 42 రోజుల సమ్మె కాలపు వేతనాలు ఇస్తూ జీఓ నం.12, మిగిలిన ఆరు సమస్యల పరిష్కారం కోసం సబ్ కమిటీకి సంబంధించిన జీఓ నం.10ను ప్రభుత్వం విడుదల చేయడంపై అంగన్‌వాడీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కె.విజయలక్ష్మి, అధ్యక్షురాలు పి.సుజాత, కార్యదర్శి పి.భారతి, కోశాధికారి టి.మాణిక్యం శుక్రవారం ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. అలాగే తమ మిగిలిన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

క్లుప్తంగా

మద్ది దేవస్థానం హుండీ ఆదాయం రూ.37 లక్షలు



ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. 72 రోజులకు వచ్చిన ఆదాయాన్ని లెక్కించగా రూ.37,27,275 వచ్చినట్లు ఆలయ ఈఓ ఆకుల కొండలరావు విలేకరులకు తెలిపారు. దేవాదాయ శాఖ తనిఖీదారు ఎ.సుజన్ కుమార్ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు ఆదాయాన్ని లెక్కించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కీసరి సరిత, ధర్మకర్తల మండలి సభ్యులు దండు వెంకట కృష్ణంరాజు, జెట్టి దుర్గమ్మ పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్



కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉదయం 10 గంటల నుంచి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలియజేశారు. స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించడానికి 32 బెంచీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ అదాలత్‌లో పరిష్కారం నిమిత్తం 8,152 కేసులను రాజీయోగ్యమైనవిగా గుర్తించామన్నారు. కక్షిదారులు నేరుగా గానీ తమ న్యాయవాది ద్వారా గానీ, సంబంధిత కోర్టు పరిధిలోని మండల లీగల్ సర్వీసెస్ కమిటీలు, జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు. కేసులను లోక్ అదాలత్ నందు రాజీ చేసుకొనడం ద్వారా సమయం,డబ్బు వృథా కాకుండా చూసుకోవచ్చునన్నారు. సివిల్ కేసుల్లో అయితే కోర్టు ఫీజులను తిరిగి పొందవచ్చని తెలిపారు.

కాటన్ పార్క్ అభివృద్ధి మార్క్



రాత్రి సమయంలో ఉత్సాహంగా ఆడుకుంటున్న చిన్నారులు



ఆకట్టుకుంటున్న ఐ లవ్ నర్సాపూర్ ఎల్ఈడీ లైటింగ్

- రూ.1.28 కోట్లతో అభివృద్ధి
- ప్రత్యేక లైటింగ్‌తో రాత్రిపూట ఆహ్లాదకర వాతావరణం



కాటన్ పార్కులో రాత్రి సమయంలో ఆకట్టుకుంటున్న లైటింగ్

నరసాపురం : పట్టణంలో ప్రధాన ప్రాంతంలో ఉండి అభివృద్ధికి నోచుకోకుండా ఉన్న కాటన్ పార్కు సర్వాంగ సుందరంగా తయారైంది. గత పాలకుల నిర్లక్ష్యంతో పూర్తిగా మూతపడ్డ పార్కును ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ప్రత్యేక చొరవ చూపించి రూ.1.28 కోట్లు 14వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి చేశారు. పనులు శరవేగంగా పూర్తిచేయడంతో పార్కు ప్రస్తుతం సర్వాంగ సుందరంగా తయారైంది. రూ 48.26 లక్షలు 14వ ఆర్థిక సంఘ నిధులతో పార్కులో సుందరీకరణ పనులు చేశారు. రూ.12.50 లక్షలు మున్సిపల్ జనరల్‌ఫండ్స్‌లో ఆటవస్తువులు, టాయిలెట్స్ నిర్మించారు. రూ.9.39 లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధులతో మొక్కలు, బ్యూటిఫికేషన్ వర్క్ చేశారు. మరో రూ.11.73 లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధులతో పార్కులో ప్లాట్‌ఫామ్ మొత్తం ఆధునికీకరించారు. పనులు పూర్తికావడంతో పార్కును సోమవారం ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రారంభించారు. ముఖ్యంగా పార్కులో రూ 19.50 లక్షలు మున్సిపల్ జనరల్‌ఫండ్స్‌తో ఏర్పాటు చేసిన లైటింగ్ ఆకట్టుకుంటోంది. అలాగే మరో రూ.11 లక్షల మున్సిపల్ జనరల్‌ఫండ్స్‌తో బస్టాండ్ ఎదురుగా ఉన్న 216 జాతీయ రహదారి నుంచి నేరుగా పార్కుకు చేరుకోవడానికి నిడదవోలు–నరసాపురం కాలువపై కాలిబాట వంతెన నిర్మించారు. ఇప్పటి వరకూ ఆహ్లాదం కరువైన నరసాపురం వాసులకు కాటన్‌పార్కు సరికొత్త అనుభూతినిస్తుంది.



సర్వాంగ సుందరంగా కాటన్ పార్కు ముఖద్వారం





కాటన్ పార్కులో ఆకట్టుకుంటున్న ఆహ్లాదకర వాతావరణం

అక్రమ మద్యం, నాటు సారా విక్రయాలపై ప్రత్యేక నిఘా

భీమడోలు: ఏలూరు జిల్లా పరిధిలో అక్రమ మద్యం, నాటు సారా విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా ఎస్ఈబీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె.రామకృష్ణ హెచ్చరించారు. భీమడోలు ఎస్ఈబీ సీఐ పి.గిరిజ ఆధ్వర్యంలో దొరసానిపాడు, తిరుమలంపాలెం, జి.కొత్తపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో పట్టుబడిన నాటు సారా, మద్యం సీసాలను శుక్రవారం ఆయన సమక్షంలో సిబ్బంది ధ్వంసం చేశారు. రూ.30వేల విలువల చేసే 225 లీటర్ల నాటు సారా, రూ.75వేల విలువైన సుంకం చెల్లించిన, చెల్లించని 566 మద్యం సీసాలను ధ్వంసం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అక్రమ మద్యం, నాటు సారా విక్రయాలు చేస్తే సహించేది లేదన్నారు. గ్రామాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. పోలీసుల సహకారంతో ఎస్ఈబీ అధికారులు గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎక్సైజ్ నేరాలకు సంబంధించి ఎలాంటి సమాచారం తెలిసినా తమకు ఫోన్ ద్వారా తెలియజేయాలని ఆయన కోరారు. 94409 02434, 94409 02429కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.



భీమడోలులో అక్రమ మద్యం, నాటు సారాను ధ్వంసం చేస్తున్న పోలీసులు

గరికపాటి కాళిదాసుకు ఏయూ కీర్తి పురస్కారం



ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరానికి చెందిన గరికపాటి ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ గరికపాటి కాళిదాసుకు ఆంధ్రా యూనివర్శిటీ కీర్తి పురస్కారం ప్రకటించింది. యూనివర్శిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య కిషన్‌రావు అధ్యక్షతన ఏర్పడిన సంఘం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన 48 మందికి కీర్తి పురస్కారాలు ప్రకటించింది. యూనివర్శిటీ ప్రకటించిన అవార్డుల్లో నగరానికి చెందిన గరికపాటి నాటక రంగానికి చేసిన విశిష్ట సేవలకు గాను ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. కీర్తి పురస్కారానికి ఎంపికైన కాళిదాసును సినీ విజ్ఞాన విశారద ఎస్వీ రామారావు, గురు శర్మ తదితరులు అభినందిచారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు(మెట్రో) : వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం ఏలూరులో రాబోయే వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉన్న సీపీడబ్ల్యూ పథకాలు, ఆర్వో ప్లాంట్లు, అన్ని హ్యాండ్ పంపులు నిర్వహణపై చర్చించారు. సీపీడబ్ల్యూఎస్ పథకాలు అన్ని పూర్తి స్థాయిలో పని చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2024–25 సంవత్సరానికి సమగ్ర మంచినీటి సరఫరా స్కీములకు జిల్లా పరిషత్ నుంచి మంజూరు చేయాల్సిన పరిపాలన ఆమోదపు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

ఎర్రకాలువలో స్నానానికి దిగి ఇంటర్ విద్యార్థి మృతి



మహీంద్ర (ఫైల్)

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని కొంగువారిగూడెం కేకేఎం ఎర్ర కాలువ పంట కాలువలో స్నానానికి దిగి ఒక యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన లింగిశెట్టి మహీంద్ర (17) ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. శుక్రవారం ఇంటర్మీడియట్ ఆఖరి పరీక్ష రాసిన మహీంద్ర, అతని స్నేహితులు మరో 12 మంది విద్యార్థులు ఎర్ర కాలువ ప్రాంతానికి వెళ్లారు. స్నానానికి దిగిన మహీంద్ర ప్రమాదవశాత్తూ కాలువలో మునిగిపోయాడు. దీంతో సహచర విద్యార్థుల సమాచారంతో స్థానికులు మహీంద్రను వెలికితీసి జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు. వైద్యుల పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రమాద ఘటన విషయాన్ని తెలుసుకున్న లక్కవరం ఎస్సై సుధీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దేశ నిర్మాణంలో యువతదే కీలకపాత్ర

తాడేపల్లిగూడెం: దేశ నిర్మాణంలో యువతదే కీలకపాత్ర అని, విద్యార్థులు చరిత్రలో నిలిచిపోయే ఆవిష్కరణలకు పాటుపడాలని ఏపీ నిట్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డీన్ డాక్టర్ జి.ఆర్‌కె.శాస్త్రి పిలుపునిచ్చారు. స్థానిక నిట్ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న ఐడియాథాన్ శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న వైజ్ఞానిక ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. సృజనాత్మకమైన ఆలోచనలతో ప్రజలకు మేలు చేసే కొత్త ప్రాజెక్టులను చేపట్టాలన్నారు. ఆలోచనలకు సానపెడితే అద్భుత ఆవిష్కరణలు ఊపిరి పోసుకుంటాయన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు రైతులు, దివ్యాంగులు పడుతున్న అవస్థల నివారణ, విద్యుత్ వాహనాలకు త్వరగా చార్జ్ చేయడం ఎలా? ఆకాశంలో డ్రోన్లు తేలికగా ఎగిరేయడం ఎలా? మెస్‌లో ఆహారం వృథా నివారణ పద్ధతులు వంటి విషయాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ వీరేష్ కుమార్, ఆచార్యులు సందీప్, ఫణికృష్ణ, నగేష్‌భట్టు, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యత ఇచ్చింది సీఎం జగనే



భీమవరం : వైఎస్సార్ సీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం : బీసీలకు అత్యధిక ప్రాధాన్యత కల్పించింది ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం గ్రామంలోని టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన సుమారు వందమంది రజకులు శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు ఏలూరులో బీసీల సదస్సు నిర్వహించి బీసీ డిక్లరేషన్ ను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించారని అన్నారు. బీసీ డిక్లరేషన్ పూర్తిగా అమలు చేసి బీసీలకు అన్ని విధాలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండగా ఉన్నారని అన్నారు. చంద్రబాబు బీసీలను కేవలం ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకున్నారన్నారు. నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్‌ని కూడా బీసీ వర్గానికి చెందిన మహిళ అయిన గూడూరి ఉమాబాలను నియమించి రాజకీయ చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయాన్ని బీసీలకు అందించిన ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

వీరవాసరం: గ్రామాల్లోని ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే చూస్తున్నారని ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని వడ్డిగూడెం గ్రామానికి చెందిన పలువురు జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా వారికి వైఎస్సార్ సీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఇంటిలోనూ ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు లబ్ధి చేకూర్చడంతో ఆ కుటుంబాలన్నీ ఆనందంతో కళకళలాడుతున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సైదు శ్రీనివాస్, గూడూరి ఓంకారం, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.



వీరవాసరం: పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

పేదలను మోసం చేసేందుకే పొత్తులు



ఏలూరు గన్‌బజార్ సెంటర్‌లో ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో పార్టీలో చేరుతున్న యువకులు

ఏలూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలోని పేదవర్గాలకు మేలు చేస్తుంటే టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ఏకమై పేదలను మోసం చేసేందుకు కుట్రలు, కుటిల రాజకీయాలు చేస్తున్నాయని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు గన్‌బజార్ సెంటర్‌లో శుక్రవారం రాత్రి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఆత్మీయ సమావేశాన్ని వైఎస్సార్ సీపీ నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు, కార్పొరేటర్ పొలిమేర దాసు, కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆళ్ల నాని రాష్ట్రంలోని పరిస్థితులను ప్రజలకు వివరించారు. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు విద్య, వైద్యంతో పాటు గూడు కల్పించేందుకు చేస్తోన్న కృషిని ప్రతిపక్షాలు అడ్డుకునేందుకు దుష్టపన్నాగాలు పన్నుతున్నాయని ఆరోపించారు. వీరందరికీ ప్రజలు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందనీ, సార్వత్రిక ఎన్నికల్లో మీ ఓటు అనే ఆయుధంతో సరైన గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్యే నాని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏలూరు నగరానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన యువత ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు పొలిమేర కిరణ్, డాక్టర్ దినేష్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట చర్యలు

ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్



ఏలూరు జిల్లా నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా శాంతియుత వాతావరణాన్ని కల్పించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వహ/ంచారు. ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి అధ్యక్షతన చేపట్టిన నేర సమీక్షా సమావేశానికి ఐజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నేర సమీక్షలో జిల్లాలో నేరాల నియంత్రణకు చేపట్టిన చర్యలు, కేసుల నమోదు, దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు, సైబర్ నేరాలు, ప్రజలకు అవగాహన వంటి అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వర్తించేలా పోలీస్ అధికారులు సమష్టిగా పనిచేయాలని ఆదేశించారు. ముందుగానే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, ఆయా గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి బైండోవర్ చేయాలనీ, నేరస్తుల కదలికలపై నిత్యం పటిష్టమైన నిఘా ఉంచాలని ఆదేశించారు. గ్రామాల్లో సాయుధ దళాలతో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రజల్లో ధైర్యాన్ని నింపాలన్నారు. సమీక్షలో జిల్లా అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి, ఎస్బీ సీఐలు మల్లేశ్వర రావు, బి.ఆదిప్రసాద్, డీసీఆర్బీ సీఐ ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

శ్రీవారి భక్తుడిపై పిచ్చికుక్క దాడి

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన నిత్యాన్నదాన సదనం వద్ద ఒక భక్తుడిపై పిచ్చి కుక్క శుక్రవారం దాడి చేసింది. ఈ దాడిలో ఆ భక్తుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం ఉండి మండలం పెదపుల్లేరుకు చెందిన ఎస్.శ్రీనివాస వర్మ నాగరాజు ఉదయం కుటుంబ సమేతంగా క్షేత్రానికి విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి అన్నప్రసాదాన్ని స్వీకరించేందుకు కొండపైన వకుళమాత నిత్యాన్నదాన సదనం వద్దకు చేరుకున్నారు. అయితే ఒక పిచ్చి కుక్క అమాంతం బాధితుడిపై దాడి చేసింది. ఎడమ చేతి వేలు సగభాగం ఊడి కిందపడేలా కరిచింది. ఇది చూసిన భక్తులు తీవ్ర భయాందోళనతో అక్కడి నుంచి పరుగులు తీశారు. అయితే దేవస్థానం సిబ్బంది హుటాహుటీన బాధితుడిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి, చికిత్సనందించారు. ఇదే శునకం గురువారం సైతం ఒక భక్తుడిపై దాడి చేయగా, అతడు కూడా పీహెచ్‌సీలో చికిత్స పొందాడు. అయితే ఆ పిచ్చికుక్కను స్థానికులు చంపివేశారు. పిచ్చికుక్క దాడి విషయం తెలుసుకున్న ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు కొండపైన, కొండ దిగువనున్న ఆలయ పరిసరాల్లో సంచరించే శునకాలను వెంటనే పట్టించి, దూర ప్రాంతానికి తీసుకెళ్లి విడిచిపెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మోటార్ల దొంగలకు రిమాండ్

పెంటపాడు: చేపలచెరువుల వద్ద మోటార్లు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలకు తాడేపల్లిగూడెం కోర్టు శుక్రవారం రిమాండ్ విధించినట్లు ఎస్సై జి. మోహనరావు తెలిపారు. వివరాల ప్రకారం భీమవరానికి చెందిన వేంద్రపు దుర్గా శ్రీనివాస్, టేకుమూర్తి గత కొంతకాలంగా చేపల చెరువులు, పంట పొలాల వద్ద మోటార్లు దొంగతనం చేస్తూ తప్పించుకొని తిరుగుతున్నారు. ఇలా మొగల్తూరు, పెంటపాడు మండలాలలో మొత్తం ఆరు మోటార్లు దొంగతనం చేశారన్నారు. కాగా గురువారం రాత్రి ముదునూరు శివార్లలో దొంగలు ఇద్దరినీ ఎస్సై మోహనరావు అరెస్టు చేసి తాడేపల్లిగూడెం కోర్టులో హాజరుపరిచారన్నారు. కాగా వీరికి కోర్టు ఈ నెల 27 వరకు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

కాశీ అన్నపూర్ణమ్మ ఆలయానికి రూ. 12 లక్షలు మంజూరు



కాశీ అన్నపూర్ణమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

పెంటపాడు: మండలంలోని 1 వార్డులో కాశీ అన్నపూర్ణమ్మ ఆలయానికి దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ రూ. 12 లక్షలు మంజూరు చేసినట్లు పెంటపాడు ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సూచనల మేరకు ఆలయం ధ్వజస్తంబం ఏర్పాటుకు, మరమ్మతుల కోసం సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బర్ల జయరాంబాబు, కాసారపు శ్రీను, ఏఎంసీ డైరెక్టర్ కర్రి వరహాలరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కిలపర్తి వెంకటరావు, దాసరి అప్పన్న, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పడాల వృద్ధాశ్రమంలో అన్నదానం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ మాజీ డైరెక్టర్ దాట్ల జగన్నాథరాజు జన్మదినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల సమానులైన వారి సమక్షంలో తన పుట్టిన రోజు వేడుక జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇలానే ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో జరిగే శుభకార్యాలు వంటి కార్యక్రమాలను వృద్ధుల మధ్య జరుపుకోవడం వల్ల వారి ఆశీస్సులు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు, యువకులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి కృషి



కొమరవరం-ఈస్ట్ విప్పర్రు రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

ఇరగవరం: రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు నిధులు వెచ్చిస్తోందని కె ఇల్లిందలపర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున అన్నారు. శుక్రవారం ఇరగవరం మండలం కొమరవరం నుంచి ఈస్ట్ విప్పర్రు వరకు రూ. 1.50 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్అండ్‌బీ రహదారులను ఆధునికీకరణ పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రహదార్లు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆర్అండ్‌బీ ఏఈ యశ్వంత్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తణుకు: రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల జీవన స్థితిగతులు దుర్భరంగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ అనుబంధ పశ్చిమగోదావరి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఆరో మహాసభ తణుకు భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డు పరిరక్షణ కోసం కార్మిక వర్గం పోరాటాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా కమిటీను ఎన్నుకున్నారు. జిల్లా సంఘం గౌరవ అధ్యక్షులుగా డి.సోమసుందర్, అధ్యక్షులుగా బొల్లాడ నాగరాజు, కార్యదర్శిగా పోలిరాతి ఆదినారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మైలవరపు రాంబాబు, కోశాధికారిగా ఏడిద గోపాలకృష్ణ, శిరిగినీడి నాగేశ్వరరావు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా సబ్సిడీపై రుణాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్క కుటుంబం ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీ సభ్యులకు వ్యాపారాల నిమిత్తం బ్యాంకుల ద్వారా సబ్సిడీపై రుణాలు అందజేస్తున్నట్టు మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రి భాస్కర్‌రావు అన్నారు. పదో వార్డు పాతూరులో శిరీష సాయి స్నాక్స్ షాపునకు సభ్యురాలు ఉప్పల పద్మావతికి పట్టణ సమృద్ధి యూనిట్ తరుపున ఇండియన్ బ్యాంకు నుంచి రూ.50 వేలు మంజూరయ్యాయి. శుక్రవారం లబ్ధిదారులు ఏర్పాటు చేసిన స్నాక్స్ షాపును కర్రి భాస్కరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పర్యవేక్షణలో ఎంతో మంది మహిళలను గుర్తించి వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పదో వార్డు ఇన్‌చార్జి అడ్డాల నరసింహారావు, ఆర్పీ సత్య, సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ కర్రి సీతారామయ్య, ఆరాధ్యుల రాము, చౌదరి పాల్గొన్నారు.

తణుకు ప్రభుత్వాసుపత్రిలో క్యాన్సర్ వైద్యసేవలు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో క్యాన్సర్ రోగులకు సంబంధించిన కీమోథెరపీ వార్డు.

- కీమోథెరపీ విభాగం
- ప్రతి శుక్రవారం క్యాన్సర్ పరీక్షలు
- వైద్యసేవలు ఉపయోగించుకుంటున్న రోగులు

తణుకు అర్బన్: రోగాలన్నింటిలోను అత్యంత ప్రమాదకరంగా పరిగణించే క్యాన్సర్ వ్యాధికి తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. క్యాన్సర్ రోగ నిర్ధారణై రెండు సైకిల్స్ కీమోథెరపీ పూర్తయిన తరువాత 3వ కీమోథెరపీ నుంచి వైద్యసేవలు తణుకు ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చాయి. ఇందుకోసం ఇటీవల తణుకు ఆస్పత్రిలో ప్రత్యేక పరికరాలను అందుబాటులో ఉంచి నాలుగు బెడ్స్‌తో ఒక విభాగాన్ని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చేతులమీదుగా ప్రారంభించారు. కాకినాడ, విజయవాడ ఆస్పత్రుల్లోని క్యాన్సర్ విభాగ నిపుణుల సూచనలతో కీమోథెరపీ సేవలు అందించనున్నారు. ఇందుకోసం ఇద్దరు వైద్యులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మసిస్ట్, నలుగురు స్టాఫ్ నర్సులు కాకినాడ ఆస్పత్రిలో శిక్షణ తీసుకున్నారని వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా దీనికి సంబంధించిన మందులు సైతం ఆస్పత్రిలోని ఫార్మసీ విభాగం నుంచి ఉచితంగా అందిజేయనున్నారు.

ప్రతి శుక్రవారం క్యాన్సర్ సేవలు..

తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నవ్య కేర్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా మెమోరియల్ సెంటర్, నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ సంయుక్త ఆధ్వర్యంలో స్ట్రెంగ్దెనింగ్ క్యాన్సర్ కేర్ డెలివరీ ఇన్ ఆంధ్రప్రదేశ్ త్రూ టెక్నాలజీ సొల్యూషన్స్ విభాగం ఈ ఏడాది జనవరిలో ప్రారంభించారు. క్యాన్సర్ విభాగంలో ప్రత్యేక యాప్‌లో నమోదు చేసుకుని తద్వారా కాకినాడ, విశాఖపట్నం ఆస్పత్రుల్లో క్యాన్సర్ వైద్యసేవలను ఉచితంగా పొందవచ్చు. ముఖ్యంగా క్యాన్సర్ రోగికి ఈ ఆన్‌లైన్ సేవల ద్వారా డబ్బు ఖర్చు, దూరప్రాంతాలకు తిరిగే పనిలేకుండా మనోధైర్యంతో ఉచిత వైద్యం పొందవచ్చు. ఈ విభాగంలో రోగి వివరాలకు సాంకేతికను జోడించడం ద్వారా రోగి ఆరోగ్య స్థితిగతులతోపాటు ఏరకమైన సేవలు ఏ ప్రాంతంలో పొందవచ్చో తెలిపే సదావకాశం ఉంది. ప్రతి శుక్రవారం ఆస్పత్రిలో క్యాన్సర్ రోగులకు వైద్యసేవలు అందుబాటులో ఉంటున్నాయి.

సీఎం జగన్ చొరవ



క్యాన్సర్ బారిన పడి చాలా మంది ప్రజానీకం దూరప్రాంతాలకు వెళ్లి వైద్యసేవలు పొంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ కారణంగా రోగులకు వ్యయభారంతోపాటు ఇతర సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇప్పటివరకు గుంటూరు, విజయవాడ, కాకినాడ ప్రాంతాలకు వెళ్లి వైద్యసేవలు పొందుతున్నారు. ఈ సమస్యను అధ్యయనం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాన్సర్ వైద్యాన్ని జిల్లా ఆస్పత్రుల్లో అందుబాటులోకి తీసుకువచ్చారు.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు,
రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి

అందుబాటులో కీమోథెరపీ సేవలు



క్యాన్సర్ రోగులకు సంబంధించి రేడియేషన్ అనంతరం నిర్వహించే కీమోథెరపీ ఇతర ఆస్పత్రుల్లో రెండు సైకిల్స్ పూర్తి చేసుకున్నవారికి తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మూడవ సైకిల్ నుంచి సేవలు అందిస్తున్నాం. ఇందుకోసం వైద్యులు, సిబ్బంది ప్రత్యేక శిక్షణ పొంది ఉన్నారు. కాకినాడ, విజయవాడ ఆస్పత్రులకు సంబంధించిన క్యాన్సర్ వైద్యనిపుణుల సలహాలతో ప్రత్యేక విభాగం ఏర్పాటుద్వారా క్యాన్సర్ రోగులకు వైద్యసేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ వెలగల అరుణ,
తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్

ఆస్పత్రిలో క్యాన్సర్ సేవలు



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో క్యాన్సర్ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. నవ్య కేర్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా మెమోరియల్ సెంటర్, నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం ఆస్పత్రిలో క్యాన్సర్ స్క్రీనింగ్ జరుగుతోంది. క్యాన్సర్ లక్షణాలు ఉన్న వారికి వివిధ పరీక్షలు నిర్వహించి వైద్యసేవల కోసం కాకినాడ, విజయవాడ ఆస్పత్రులకు పంపించి ఉచిత వైద్యం అందిస్తున్నారు.

– డాక్టర్ దాట్ల సుందరరామరాజు,
తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు

ఈవీఎంలపై అవగాహన అవసరం



గూడెంలో ఈవీఎంలపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

తాడేపల్లిగూడెం: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) నిర్వహణ , వాటి వినియోగ విషయంలో అవగాహన ఉంటే పోలింగ్ రోజున ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈవీఎం, నిర్వహణపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలింగ్ సమయంలో ఎటువంటి సందేహాలకు, సమస్యలకు తావివ్వవద్దని ముందుగానే అన్ని విషయాలను ఆకళింపు చేసుకోవాలన్నారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈవీఎం, వీవీప్యాట్లు, హ్యాండు బుక్, పోలింగ్ కేంద్రాలపై పూర్తి సమాచారం తెలుసుకొని ఉండాలన్నారు. ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. బాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు , వీవీ ప్యాట్లను పోలింగ్ కేంద్రాల్లో అమర్చడం పై మాక్ పోలింగ్ ద్వారా విశదీకరించారు. హ్యాండుబుక్‌లోని ప్రతి అంశాన్ని డైరీలో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కె.చెన్నయ్య ,తహసీల్దార్లు మురళీకృష్ణ, సురేష్(పెంటపాడు)ఎంపీడీఓ శర్మ, సెక్టారు అధికారులు, పీఓలు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నాగేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు

తణుకు టౌన్: మండలంలోని దువ్వ గ్రామంలో శ్రీ నాగేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవాలను ఈనెల 16నుంచి 20వతేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో పీ. సూర్యనారాయణ తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి ప్రతిష్ఠ కార్యక్రమాల్లో రాష్ట్ర పౌర సరపరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



తణుకు టౌన్: పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



అత్తిలి: ఉరదాళ్లపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: గర్భిణులు పోషకాహారం సక్రమంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకటలక్ష్మి చెప్పారు. శుక్రవారం వారం తణుకు రూరల్ మండలం దువ్వ, తేతలి, ముద్దాపురం, కోనాల, కొమరవరం, మహాలక్ష్మి చెరువు తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పోషకాహార మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ రకాల పదార్థాలు, కూరగాయలు, వాటి పోషణ విలువల గురించి మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏఎంస్‌లు, ఆశా కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే చిన్నారుల్లో పెరుగుదల

అత్తిలి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతినెలా తమ బిడ్డల బరువు, ఎత్తులను చూపించుకోవాలని ఐసీడీఎస్ తిరుపతిపురం సెక్టార్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి అన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గ్రోత్‌మోనటరింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారంతోపాటు తాజా ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవడం ద్వారా హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ఆర్‌కే కుమారి, జి నాగజ్యోతి పాల్గొన్నారు.

సామాజిక సేవలను నిరాటంకంగా కొనసాగిస్తాం



ఎల్.అగ్రహారం ఇందిరమ్మ కాలనీలో వృద్ధులకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: సామాజిక సేవా కార్యక్రమాలను నిరాటంకంగా కొనసాగిస్తామని వల్లీ మోహన్ యువజన సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పటాన్ వలీ, గొల్లేరు మోహన్ అన్నారు. వల్లీ, మోహన్ యువజన సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ఎల్.అగ్రహారం ఇందిరమ్మ కాలనీలోని సంస్థ కార్యాలయంలో నలుగురు పేద వృద్ధులకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షుడు ఉండ్రాజవరపు భాస్కరరావు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం పట్టణంలో చెత్త కుండీలో ఆడ శిశువును పారేయడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనంతరం వృద్ధులకు బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి గజ్జెల సమర్పణరావు, బచ్చు దినేష్‌కుమార్, సుభాని, మెంటే రాంబాబు, పోలిశెట్టి రంగారావు, యువి.సునీత, నేదూరి సత్యనారాయణ, బి.సత్యనారాయణ, జాలి దానయ్య శ్రీరామ్, కామిశెట్టి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

తణుకు టౌన్: జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిషోర్ తెలిపారు. మండలం కొమరవరం గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్యసురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 262 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కొమరవరం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో మొత్తం 262 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 30 మందికి కంటి పరీక్షలు, ఆరుగురు పాఠశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. నలుగురిని ఆరోగ్య శ్రీ ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. ఈశిబిరంలో గ్రామ సర్పంచ్ కరిబండి రాజేష్, డాక్టర్ కే సాయి భవానీ, డాక్టర్ కే రామిరెడ్డి, హాయకులు, ఏఎన్ఎంలు, ఇతర వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రేలంగి జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరం

ఇరగవరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రేలంగి సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం కోరారు. శుక్రవారం ఇరగవరం మండలం రేలంగి సచివాలయంలో జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరంలో 302 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులకు మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ఆస్పత్రికి సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె పద్మజ్యోతి, డాక్టర్ నిమ్మల సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ సాయిగిరిరెడ్డి, డాక్టర్ ఎంవీబీ రఘువీర్, చేబ్రోలు పెద్దిరాజు, సచివాలయ కార్యదర్శి సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ప్రతిభను ప్రోత్సహించాలి



భవిత సెంటర్‌లో తల్లిదండ్రులకు సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల్లో ప్రతిభను ప్రోత్సహించాలని లయన్స్‌క్లబ్ డైమండ్స్ జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు తెలిపారు. శుక్రవారం తల్లిదండ్రుల దినోత్సవాన్ని స్థానిక భవిత దివ్యాంగ శిక్షణ కేంద్రంలో నిర్వహించారు. దివ్యాంగుల తల్లిదండ్రులను సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ దివ్యాంగుల లోపాన్ని చూడకుండా వారిలో ఉన్న ప్రతిభను చూసి ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలో మనోధైర్యాన్ని కల్పించినట్‌లైతే అన్ని రంగాల్లో రాణిస్తారని చెప్పారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన దివ్యాంగుల విద్యార్థులకు క్లబ్ తరుపున ఇంటర్ చదవడానికి తమవంతు సహాయసహకారాలు తప్పక అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, డాక్టర్ కేవీ కమల, లయన్స్‌క్లబ్ సభ్యులు, ప్రధానోపాధ్యాయురాలు బి.జ్యోతి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం పట్టణంలో 15, 16 వార్డుల్లో ప్రై డే, డ్రై డే, వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పరిశీలనలు జరిగాయి. ర్యాలీలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. హెల్త్ సిబ్బంది ఆధ్వర్యంలో దోమల ద్వారా వచ్చే వ్యాధులు నియంత్రించాల్సిన ప్రాధాన్యతను ప్రజలలోకి అవగాహన కార్యక్రమాలు ద్వారా తీసుకువెళ్లాలని సూచనలు చేశారు. పరిశుభ్రత ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు చంద్ర, అంబిక, ఆశాలు వెంకటలక్ష్మి, భవాని, కుమారి, ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

పెంటపాడు: దోమల నియంత్రణ ద్వారానే వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చని గూడెం మలేరియా నియంత్రణ అధికారి వై.వీ లక్ష్మణరావు పేర్కొన్నారు. పెంటపాడు పీహెచ్‌సీ పరిధిలోని మూడు సచివాలయాల్లో ఫ్రైడే, డ్రైడే, వెక్టార్ కంట్రోల్ హైజీన్ ప్రోగ్రాంను పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు తోట రాజేష్, మానిక, ఆరోగ్యసిబ్బంది, మీసాల సాయి, మారిశెట్టి తేజోనాద్, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



ప్రత్తిపాడు వై.జంక్షన్ దుర్గమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

పెంటపాడు: రాష్ట్రంలో కోట్లాది రూపాయల నిధులతో అన్ని హిందూ దేవాలయాలు అభివృద్ధి చెందుతున్నాయని వైఎస్సార్ సీపీ మండల పూర్వాధ్యక్షుడు వీర్ల గోవింద్ పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి, దేవాదాయ శాఖామంత్రి కొట్టు సత్యనారాయణ సూచనల మేరకు సీజెఎఫ్ నిధులైన రూ. 25 లక్షల వ్యయంతో శుక్రవారం ఆయన ప్రత్తిపాడు వై.జంక్షన్ కనకదుర్గమ్మ అమ్మవారి ఆధనపు భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సైపురెడ్డి రాంబాబు, ఈవో నీలకంఠం, వీర్ల వెంకటేష్, వీర్ల ధనరాజు, జవ్వాది శేషగిరి, ఆకుల రామచంద్రరావు, నూనె శ్రీలక్ష్మి, కాసాని సరోజని, తుమ్మగంటి భాగ్యలక్ష్మి, అర్చకులు కొత్తలంక శివసత్యనారాయణ, దేవాలయ అధికారులు మొగళ్లపు పార్థసారధి, తాడిపర్తి వీరాస్వామి, కాగలంపాడు ఆలయ అధ్యక్షులు బడేటి భాను తదితరులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో యువతదే కీలకపాత్ర



ఐడియా థాన్‌లో మాట్లాడుతున్న నిట్ విద్యార్థిని

తాడేపల్లిగూడెం: దేశ నిర్మాణంలో యువతదే కీలకపాత్ర అని, విద్యార్థులు చరిత్రలో నిలిచిపోయే ఆవిష్కరణలకు పాటుపడాలని ఏపీ నిట్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డీన్ డాక్టర్ జి.ఆర్‌కె.శాస్త్రి పిలుపునిచ్చారు. స్థానిక నిట్ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న ఐడియాథాన్ శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న వైజ్ఞానిక ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. సృజనాత్మకమైన ఆలోచనలతో ప్రజలకు మేలు చేసే కొత్త ప్రాజెక్టులను చేపట్టాలన్నారు. ఆలోచనలకు సానపెడితే అద్భుత ఆవిష్కరణలు ఊపిరి పోసుకుంటాయన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు రైతులు, దివ్యాంగులు పడుతున్న అవస్థల నివారణ, విద్యుత్ వాహనాలకు త్వరగా చార్జ్ చేయడం ఎలా? ఆకాశంలో డ్రోన్లు తేలికగా ఎగిరేయడం ఎలా? మెస్‌లో ఆహారం వృథా నివారణ పద్ధతులు వంటి విషయాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ వీరేష్ కుమార్, ఆచార్యులు సందీప్, ఫణికృష్ణ, నగేష్‌భట్టు, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెండు రోజులపాటు బైబిల్ ఎగ్జిబిషన్

పెంటపాడు: గూడెం రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న టౌన్ ఎ. క్లాష్‌ప్యారిష్ లూథరన్ చర్చిలో శని, ఆదివారాల్లో బైబిల్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు గురుమండల అధ్యక్షుడు డీఎల్ ఫీనెహాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరుకు చెందిన బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఏపీ ఆగ్జిలరీ ఆధ్వర్యంలో క్రైస్తవులకు ఉపయోగపడే అన్ని రకాల బైబిల్, చక్కటి సమాచారంతో కూడిన ఆధ్యాత్మిక క్రైస్తవ పుస్తకాలు తక్కువ ధరలకు లభిస్తాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ క్రైస్తవ గ్రంథశాల అందుబాటులో ఉంచుతున్నామన్నారు. పలు ప్రాంతాలు దైవసేవకులు, క్రైస్తవులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.